అభివృద్ధికి ఆమడదూరం

- గిరి గ్రామాల్లో కానరాని సౌకర్యాలు
- ఇబ్బందుల్లో గిరిజనులు
- పట్టించుకోని అధికారులు

గుడిహత్నూర్: ఎన్ని ప్రభుత్వాలు మారినా గిరిజనుల సమస్యలు అలాగే ఉన్నాయి. మారుమూల గిరి గ్రామాల్లో ఏళ్లుగా కనీస సౌకర్యాలు కానరావడం లేదు. రోడ్డు సౌకర్యం లేక ఆదివాసీలు, గిరిజనులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి 44 పై ఉన్న సీతాగోంది నుంచి సుమారు 4 కి.మీ ఉండే న్యూసోమార్‌పేట్, సోమార్‌పేట్, మాన్కుగూడ గ్రామాలు వెలసి ఏళ్ల వుతున్నాయి. ఇక్కడి గిరిజనులు వ్యవసాయం, కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ గ్రామాలకు వెళ్లాలంటే మాన్కుగూడ మినహా ఈ రెండు గ్రామాలకు వెళ్లాలంటే గర్కంపేట్ వరకు ఆటోలో వెళ్లాలి. అక్కడి నుంచి ఇక సైకిల్, బైక్, ఎడ్లబండి, ట్రాక్టరే దిక్కు. సోమార్‌పేట్‌కు అష్టకష్టాలు పడి ఆటోలో వెళ్లవచ్చు. ఆ తర్వాత కాళ్లకు పని చెప్పాల్సిందే. అత్యవసరమైతే ఎడ్లబండే దిక్కు. దశాబ్దాలుగా గడుస్తున్నా నేటికీ ఈ గ్రామాలు బీటీ రోడ్డుకు నోచుకోలేదు. అధ్వాన రోడ్డుపై సంకలో పిల్లలనెత్తుకొని భుజాన సామగ్రి ఎత్తుకొని నడవాల్సిందే. ఇన్నీ ఇక్కట్లు పడుతున్న సంబంధితశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గిరిజనులు వాపోతుఅన్నారు. గతంలో ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు హామీలు ఇచ్చారే తప్ప అభివృద్ధి పనులు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. న్యూసోమార్‌పేట్‌తోపాటు సోమార్‌పేట్‌లో సీసీ రోడ్డ్, మురుగుకాల్వలు నిర్మించలేదని మండిపడుతున్నారు. న్యూసోమార్‌పేట్‌లో అంగన్‌వాడీ కేంద్రం లేక చిన్నారులు ప్రభుత్వ ఫలాలు అందలేకపోతున్నారు.

వర్షాకాలంలో అంతే సంగతి..

వర్షాకాలంలో గ్రామానికి సమీపంలో ఉన్న వాగు నిండాపారితే గిరిజనులు బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారు. సీతాగోందిలో ఉన్న చౌకధరల దుకాణానికి, మిగతా నిత్యావసరాలు సమకూర్చుకోవడానికి ఎంతో ప్రయాస పడి వీరు నిత్యం రావల్సిందే. సోమార్‌పేర్, న్యూసోమవార్‌పేట్ మాత్రం అంబులెన్సుకు సేవలందే పరిస్థితి లేదు. బాధితులను ఎడ్లబండ్లలో గర్కంపేట్ వరకు తీసుకురావల్సిందే.


అధ్వానంగా న్యూసోమార్‌పేట్ వెళ్లేదారి


న్యూసోమార్‌పేట్ గూడెం

ఐటీడీఏ ఏం చేస్తోంది?

గిరిజనులను జీవన ప్రమాణాలు పెంచి వారికి విద్య, వైద్యం, రోడ్డు, తాగునీరు అందించడానికి ప్రత్యేకంగా ఏర్పడ్డ (ఐటీడీఏ) సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఏం చేస్తోంది? గ్రామాల పెద్దలు, గిరిజన నాయకులు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికలు సమీపిస్తున్నప్పుడే గ్రామాన్ని సందర్శించి హామీలు ఇస్తూ, ఓట్లు వేసుకున్నా తర్వాత ముఖం చాటేస్తున్నారని ఆదివాసీలు చెబుతున్నారు.

పట్టించుకుంట లేరు



రోడ్డు నిర్మిస్తామని గతంలో ఎమ్మెల్యే వచ్చారు. కొబ్బరి కాయ కొట్టి వెళ్లి పోయారు. ఏమైంది. ఏమీ కాలే. వర్షం పడితే బయటకు వెళ్లలేని పరిస్థితి. మా గూడేల్లో ఉన్న సమస్యలు తీరలేదు. పాలకులు పట్టించుకుంట లేరు.

– సిడాం లస్కు, న్యూ సోమార్‌పేట్

రోడ్డు సమస్య తీర్చాలె..



మా పరిస్థితి చూసి నాయకులు వస్తున్నారు మేం వారికి విన్నవించుకుంటున్నాం. అంత వరకే సరిపోయింది. మా సమస్యలు పట్టించుకోవాలి. రోడ్డు సమస్యను తీర్చితే చాలు. అదే మాకు పదివేలు.

– సిడాం పొత్తుబాయి, న్యూసోమార్‌పేట్

క్లుప్తంగా

'కంది' తీరుతోనే రాజీనామా



మాట్లాడుతున్న కాక్డే నాందేవ్

ఎదులాపురం: ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి తీరు వల్లే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కాక్డే నాందేవ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ సీనియర్ నాయకులు సాజిద్‌ఖాన్, గంద్రత్ సుజాత, అల్లూరి సంజీవరెడ్డిలకు టికెట్ కేటాయించకుండా పారాషూట్ నేత అయిన కంది శ్రీనివాస్‌రెడ్డికి అధిష్టానం టికెట్ కేటాయించిందన్నారు. పార్టీ అధినాయకత్వం సూచనలతో ఎన్నికల్లో ప్రచారం గురించి ఆయన్ను సంప్రదిస్తే తనను కించపరిచేలా కంది మాట్లాడారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో మనోవేదనకు గురై పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వివరించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న జడ్జి బి.హుస్సేన్

బోథ్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి పంద్రం శంకర్, న్యాయవాదులు కుమ్మరి విజయ్, దమ్మపాల్, హెచ్ఎం పోశెట్టి, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకుసాగాలి


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బేల: విద్యార్థులు లక్ష్యంతో ముందుకుసాగితే విజయం సాధిస్తారని ప్రముఖ వ్యక్తిత్వ నిపుణుడు దాస్యం మురళీధర్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని గోవర్ధన్ గార్డెన్‌లో కీర్తన డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం ప్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మురళీధర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు అలరించాయి. కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రపు రవీందర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్, ఎస్సై రాధిక, కళాశాల చైర్మన్ పవన్‌కుమార్ అగర్వాల్, ప్రిన్సిపాల్ వరప్రసాద్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ భరద్వాజ్ అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్, ఖోఖో, అథ్లెటిక్స్, చెస్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల పోటీలు విద్యార్థుల్లో స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. లెక్చరర్లు రాజ్‌కుమార్, క్రాంతికుమార్, సుజయ్, రాజన్న, అనిల్, సుధాకర్, నీల్‌కమల్, విజయలక్ష్మి, జ్యోత్స్న రాణి, యశస్వి, సంగీత, హేమలత, గజానంద్, శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఉర్దూ దినోత్సవం

ఆదిలాబాద్‌టౌన్: ప్రపంచ ఉర్దూ దినోత్సవం సందర్భంగా ఉర్దూ కవి అల్లమ ఇక్బాల్ జయంతిని సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని షమా ఉర్దూ స్కూల్‌లో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా సిరాజొద్దీన్ మాట్లాడుతూ ఉర్దూ కవి ఇక్బాల్ రచించిన కవిత్వాలు, ఆయన జీవిత చరిత్ర గురించి వివరించారు. అంతకుముందు వారికి పండ్లు పంపిణీ చేశారు. హ్యూమన్‌రైట్స్ అధ్యక్షుడు షేక్ ఇర్ఫాన్, పాఠశాల హెచ్ఎం సలీమ్, షఫీక్, అథర్, ఫౌండేషన్ సభ్యులు ఇమ్రాన్‌ఖాన్, ఖాలిద్ అహ్మద్, తబ్రేజ్ ఖాన్, అస్లమ్ ఖాన్, షేక్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ఒరిగిందేమీలేదు

- ఎమ్మెల్యే జోగు రామన్న


కండువా కప్పుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం పలువురు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పనితీరును చూసి పలువురు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు భూమన్న, నర్సింగ్‌రావు, సాజిదొద్దీన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'తాగునీరు, విద్యుత్ ఘనత బీఆర్ఎస్‌దే'


పార్టీలో చేరిన మహిళలతో జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: నిరంతర విద్యుత్, తాగునీటి సరఫరాను అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్‌లోని పద్మశాలి సంఘం భవనంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు, యువకులు పెద్దఎత్తున ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో ఎదుర్కొన్న ఇబ్బందులను బీఆర్ఎస్ పరిష్కరించిందన్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు కోతలు ఉండేవని, మంచినీటి సరఫరా ఇవ్వడం కూడా సాధ్యం కాలేదన్నారు. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్థానిక పరిస్థితులపై కనీస అవగాహన లేకుండా మాట్లాడటం సమంజసం కాదన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తున్న కారు గుర్తు పార్టీకే పట్టం కట్టాలని ప్రజలను కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, కౌన్సిలర్ శ్రీలత లక్ష్మణ్, నాయకులు కొండ గణేశ్, దరవేణి రాము, తిరుపతి, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సత్యపాల్ మారాజ్ సప్త ఖంజరి విజయవంతం చేయండి

ఎదులాపురం: సత్యపాల్ మహరాజ్ సప్త ఖంజరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ అధ్యక్షుడు, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ కోరారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాకేంద్రంలోని కైలాస్‌నగర్ అశోక బుద్ధవిహార్‌లో శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. మహారాష్ట్రకు చెందిన సత్యపాల్ మహారాజ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. బౌద్ధ ఉపాసకులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. సమత ఫౌండేషన్ అధ్యక్షులు అనిల్ సావ్లే, గంగారం బొర్కర్, దయానంద్ కాంబ్లే, దయానంద్ నర్వాడే, లక్ష్మీకాంత్ కాంబ్లె, తుకారం జీవానే, సత్యవాన్ చిటికె, రవీంద్ర జవానే, రఘునాథ్ పవర్, గుల్షన్ బన్సోడే, గౌతమ్ సింగ్నూర్, జనార్దన్, సూర్యవంశీ, రాజు హాట్కారే, సూరజ్ సోన్‌కాంబ్లే, రాహుల్ జాందడే, నిశాంత్ దౌనే పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడివి పచ్చి అబద్ధాలు

- కాంగ్రెస్ మాజీ నాయకులు


సీఆర్ఆర్ మాట్లాడిన ఆడియో వినిపిస్తున్న సాజిద్‌ఖాన్

కైలాస్‌నగర్: కంది శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఇస్తే గెలిపించుకుంటామనే దివంగత నేత చిల్కురి రాంచంద్రారెడ్డి చెప్పిన మేరకే ఆయనకు ఈ ఎన్నికల్లో టికెట్ ఇచ్చామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సభలో చెప్పడం పచ్చి అబద్ధమని కాంగ్రెస్ మాజీ నాయకులు గంద్రత్ సుజాత, సాజిద్‌ఖాన్ ఆరోపించారు. గురువారం స్థానిక శాంతినగర్‌లోని సీఆర్ఆర్ నివాసంలో నిర్వహించిన సమావేశంలో రేవంత్‌రెడ్డిపై వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కందికి పార్టీతో సంబంధం లేదని, ఆయనకు ఎవరు సహకరించబోమని సీఆర్ఆర్ బతికి ఉన్నప్పుడు మాట్లాడిన ఆడియోను మీడియాకు వినిపించారు. చనిపోయిన వ్యక్తిపై అబద్ధపు మాటలతో ప్రజలను మభ్యపెట్టేలా మాట్లాడటం రేవంత్‌రెడ్డికి సరికాదన్నారు. నోట్ల కట్టలకు ఆశపడి సీట్లు అమ్ముకుని కాంగ్రెస్ పార్టీని భ్రష్టుపట్టించారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలను పార్టీలోకి తీసుకొచ్చి కోట్లకు సీట్లు కేటాయించి, నిజమైన కాంగ్రెస్ నాయకులను కత్తి, తుపాకీ లేకుండానే హత్యచేశారని ఆరోపించారు. పార్టీ నాయకుడు అల్లూరి సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ఆర్ఐకి టికెట్‌ను కేటాయించి కాంగ్రెస్ వాదులకు అన్యాయం చేశారన్నారు. స్వతంత్ర్య అభ్యర్థిగా శుక్రవారం తాను నామినేషన్ వేస్తున్నానని తమ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. సమావేశంలో నాయకులు వసీం, గౌలి సంజయ్, కన్నె ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

'సీఆర్ఆర్ ఫొటో పెట్టే అర్హత లేదు'


ఆలయంలో కుటుంబ సభ్యులతో సంజీవ్‌రెడ్డి

కైలాస్‌నగర్: దివంగత నేత సి.రాంచంద్రారెడ్డి చెప్పారని కంది శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ కేటాయించామని చెబుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణం చేసేందుకు రావాలని కాంగ్రెస్ మాజీ నాయకుడు అల్లూరి సంజీవ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని చెరువు కట్ట జాగృతి హనుమాన్ ఆలయంలో గురువారం ఉదయం 11.30గంటలకు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. వారు చెప్పే మాటలు నిజమని నమ్మితే తడిబట్టలతో ప్రమాణం చేయాలని, అబద్ధమని నేను ప్రమాణం చేసేందుకు సిద్ధమన్నారు. 12.30గంటల వరకు కంది రాక రాకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. తన మామ రాంచంద్రారెడ్డి చనిపోతే రేవంత్‌రెడ్డి, కంది శ్రీనివాస్ రెడ్డి తనకు ఫోన్ చేయలేదన్నారు. బహిరంగ సభ నిర్వహించిన మైదానానికి అర కిలోమీటర్ దూరంలో తన అత్తగారు ఉంటారని, ఆమెను పరామర్శించడానికి వారు రాలేదన్నారు. అలాంటి నాయకులకు సీఆర్ఆర్ ఫొటో పెట్టుకునే అర్హత లేదన్నారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి రావాలని సవాల్ విసిరారు.

'ఎమ్మెల్యే రేఖానాయక్ క్షమాపణ చెప్పాలి'


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఇంద్రవెల్లి: ఉట్నూర్ కాంగ్రెస్ సభలో బుధవారం సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే రేఖానాయక్ వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం విలేకరులతో వారు మాట్లాడారు. కేసీఆర్‌ని విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదన్నారు. ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాల్లో బ్రోకర్లు, ప్రతి పనిలో వాటా అడిగింది మీరు కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకపోతే గ్రామాల్లో తిరిగనీయమని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ పోటే శోభాబాయి, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జీలానిబేగ్, సర్పంచులు లఖన్, ఉప సర్పంచ్ గణేశ్ తహరే, ఎంపీటీసీ సభ్యులు భీంరావ్, ఆశబాయి, బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ సుఫీయన్, మండల ఉపాధ్యక్షుడు రాందాస్, నాయకులు కనక హనుమంత్‌రావ్, రాథోడ్ మోహన్‌నాయక్, కనక తుకారం, కోరెంగా సుంకట్‌రావ్, శ్రీనివాస్, మీర్జా ఇర్శద్ పాల్గొన్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి'



తాంసిలో ప్రచారం చేస్తున్న నాయకులు

తాంసి: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి అన్నారు. బోథ్ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావ్ మద్దతుగా మండల కేంద్రంలో మండల నాయకులతో కలిసి గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి సోయంను గెలిపించాలని కోరారు. మండల కార్యదర్శి సుభాష్, నాయకులు లస్మన్న, స్వామి, రాజన్న తదితరులు ఉన్నారు.

నేరడిగొండ: మండలంలోని రేపల్లి, బండగూడ, నంద్యానాయక్ తండాలో గురువారం గడప గడపకూ బీజేపీ నిర్వహించారు. ఓటరుల కమలం గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సోయం బాపూరావ్‌ను గెలిపించాలని పార్టీ నాయకులు కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణ సింగ్, నాయకులు కమల్‌సింగ్, మండల అధ్యక్షుడు సోనయ్య హీరాసింగ్, తోట శంకర్, లక్ష్మణ్, బాత్రే శేఖర్, సోలంకి ప్రశాంత్ పాల్గొన్నారు.


గాదిగూడ మండలం లోకారి(కే)లో..


భగవాన్‌పూర్‌లో గుస్సాడీల నృత్యం


పాల్గొన్న సుహాసినిరెడ్డి, తదితరులు

కొనసాగుతున్న దండారీ ఉత్సవాలు

ఇంద్రవెల్లి/నార్నూర్/బోథ్/ఆదిలాబాద్‌రూరల్/తాంసి/ఉట్నూర్‌రూరల్/తలమడుగు: ఏజెన్సీ ప్రాంతాల్లో దండారీ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. భోగి పూజలతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు గురువారం ఆదివాసీలు ఎత్మసుర్ దేవతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుస్సాడీలు, యువకులు సంప్రదాయ నృత్యాలు చేశారు. ఆదిలాబాద్‌రూరల్ మండలం లోహార, లింగుగూడ గ్రామాల్లో జరిగిన ఉత్సవంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఉట్నూర్ మండలం లక్కారం దేవుశావ్‌గూడ, టక్కుగూడ, నర్సాపూర్(బి)లో ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని పూజలు చేశారు.

ఎత్మసుర్ దేవతలకు పూజలు

ఇచ్చోడ: మండలంలోని బాదిగూడలో గురువారం ఎత్మసుర్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామపొలిమేరలో గుస్సాడీలు ధరించే టోపీలు, ఇతర సామగ్రికి పూజలు నిర్వహించి దండారీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామపటేల్ సిడాం లక్ష్మీకాంత్‌రావు, దేవారి పెందుర్ బండు, మహాజన్ పెందర్ యాదవ్‌రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


ఆడి పాడుతున్న వెడ్మబొజ్జు పటేల్


బోథ్: వజ్జర్‌లో దండారీ ఉత్సవాలు

సంక్షిప్తంగా

'కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరు'

ఎదులాపురం: ఎవరెన్ని విష ప్రచారాలు చేసినా, ఎన్ని అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నించినా కాంగ్రెస్ గెలుపును ఆపలేరని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డికి మద్దతుగా డైట్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన విజయభేరి సభ విజయవంతమైందన్నారు. పదిహేనేళ్లుగా జోగు రామన్న చెబుతున్న మోసపూరిత మాటలు, ఇస్తున్న హామీలను ప్రజలు ఇక నమ్మేస్థితిలో లేరని అన్నారు. నాయకులు గిమ్మ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మాంగ్‌సమాజ్ మండల నూతన కార్యవర్గం

ఇచ్చోడ: మండల కేంద్రంలో మాంగ్‌సమాజ్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాడేకర్ శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా తల్వరే విఠల్, ప్రధాన కార్యదర్శిగా కాంబ్లె రాందాస్, సంయుక్త కార్యదర్శిగా జాదవ్ సుధామ్, కోశాధికారిగా పోత్రె శివమూర్తి, సలహాదారుగా కాంబ్లె వినోద్, ఘేరే నాందేవ్ ఎన్నికయ్యారు.

కార్మిక వ్యతిరేక పార్టీలను ఓడించాలి

ఎదులాపురం: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పార్టీలను ఎన్నికల్లో ఓడించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సుభాష్, జగన్‌సింగ్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్ శక్తుల కోసం నూతన చట్టాలు తీసుకువచ్చిన పార్టీలను ఓడించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. జిల్లా నాయకులు నితిన్, రాజేశ్వర్, శంకర్, రాజు పాల్గొన్నారు.

గోరక్షణకు కృషిచేయాలి

ఇచ్చోడ: గోరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బోథ్ సివిల్‌కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని జై శ్రీరాం గోశాల వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న షెడ్డు నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. జై శ్రీరాం గోశాలలో 250పైగా ఆవుల సంరక్షణ చూస్తున్న నిర్వాహకుడు ఐద రాజేశ్‌ను అభినందించారు. కోర్టు సూపరిండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన వెండి సోమేశ్వర్ బీజేపీకి రాజీనామా చేశారు. సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ గెలిపించేందుకు కృషిచేస్తాననని సోమేశ్వర్ అన్నారు.

బస్సును పునరుద్ధరించండి

బోథ్: హైదరాబాద్ నుంచి బోథ్ వరకు బస్సును పునరుద్ధరించాలని వీడీసీ, గ్రామస్తులు కంట్రోలర్ రాజేశ్వర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి ప్రతీరోజు బోథ్, నేరడిగొండ, సొనాల, బజార్‌హత్నూర్ మండలాల వాసులు వస్తారని, ప్రస్తుతం బస్సు లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే బస్సును పునరుద్ధరించాలని కోరారు. వీడీసీ అధ్యక్షులు గంగాధర్, గోవర్ధన్, దాస్ ఉన్నారు.

'రాష్ట్రంలో బహుజన రాజ్యాన్ని స్థాపిస్తాం'


అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

ఇంద్రవెల్లి: నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన కుమురం భీం, ఇంద్రవెల్లి అమరవీరుల సాక్షిగా రాష్ట్రంలో బహుజన రాజ్యాన్ని స్థాపిస్తామని ఖానాపూర్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి రాథోడ్ బన్సీలాల్ అన్నారు. మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద, అంబేద్కర్ విగ్రహానికి గురువారం నివాళులర్పించారు. అక్కడి నుంచి కార్యకర్తలతో కలిసి ఉట్నూర్‌లో నామినేషన్ వేయడానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగమే మేనిఫెస్టో గల ఏకైక పార్టీ బీఎస్పీ అని అన్నారు. ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ప్రజలు ఓటేసి బీఎస్పీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షుడు పెందోర్ అంకుష్, నాయకులు వావల్కర్ శివాజీ, సోన్‌కాంబ్లే సునీల్, జోందలే విజయ్, సాయికుమార్, సుద్ధోధన్, చందు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

'యువతతోనే అభివృద్ధి'



మాట్లాడుతున్న జ్ఞానేశ్

ఎదులాపురం: ఈ ఎన్నికల్లో యువతను ఆదరించాలని, వారితోనే అభివృద్ధి సాధ్యమని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు గుడిపెల్లి జ్ఞానేశ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్‌లో తమ పార్టీని గెలిపిస్తే జిల్లాకు అంతర్జాతీయ విశ్వ విద్యాలయాన్ని తీసుకువస్తామని, అందులో 20 శాతం స్థానికలకే అవకాశం కల్పిస్తామన్నారు." ఎన్‌గంగాను పూర్తిస్థాయిలో నిర్మించి రైతులకు మూడు పంటలకు నీటిని అందిస్తామన్నారు. గణేశ్, దిలీప్‌రెడ్డి, క్రిస్ తబ్రేజ్, సోహైల్, సాయికిరణ్, శ్యామ్ జాదవ్, వెంకట్, హరీశ్, లఖన్ పాల్గొన్నారు.